క్లుప్తంగా

విరాళం అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ప్రేంసాగర్‌రావు

లక్సెట్టిపేట: మండలంలోని మిట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధి ముత్యంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్ రావు హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేసి, రూ.50,116విరాళం అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో ఇటీవల పిడుగు పడి మృతి చెందిన సత్తయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పింగిళి రమేష్, పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, నాయకులు నాగభూషణం, చింత అశోక్, బానేష్, పూర్ణచందర్ రావు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నెన్నెల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కమిటీ నియామకం

లక్సెట్టిపేట: జాతీయ మాలమహానాడు పట్టణ నూతన కమిటీని ఆదివారం స్థానిక ఐబీ ఆవరణలో ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అసాది పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాధ్యక్షులుగా పెండెం రాజన్న, ఉపాధ్యక్షులుగా గొర్రె జానానందం, మినుముల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా మంచాల కుమార్, కార్యదర్శిగా మగ్గిడి ధర్మయ్య, తొగరి తిరుపతి, కోశాధికారిగా సందీప్, ప్రచార కార్యదర్శిగా కొటం మురళి, మినుముల జనార్దన్, దుంపల అమృతరావ్, సభ్యులు కోడి కుమార్, పెండెం నరేష్, అనిల్, గౌరవ సలహాదారులు పెండెం సత్తయ్య, గరిసె రవీందర్, రవి, కాంతయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా కృష్ణ

కాసిపేట: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల కృష్ణను బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్‌గా ఏఐసీసీ ఆదివాసీ అధ్యక్షుడు శివాజీరావు మోగే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ధ్యేయంగా లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్‌లో భాగంగా నూతనంగా ఇన్‌చార్జి కో ఆర్డినేటర్‌లను ఏఐసీసీ, రాష్ట్ర అధిష్ఠానం నియమించినట్లు తెలిపారు. అందులో భాగంగా బోథ్ ఎస్టీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

భీమిని: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని బెల్లంపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా అన్నారు. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, నాయకునిపేట, మెట్‌పల్లిలో ఆదివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, భీమిని పీఏసీఎస్ చైర్మన్ నారాయణ, వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీరామరావు, ఎంపీటీసీ లతశ్రీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ



ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్, జెడ్పీటీసీ

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం పుల్లూరి మల్లయ్య–తారాబాయి జ్ఞాపకార్థంగా కొడుకు, కోడలు పుల్లూరి రాజయ్య–సురేఖ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా ఈ అంబలి పంపిణీని ప్రారంభించినట్లు స్థానిక సర్పంచ్ పుల్లూరి సురేఖ–రాజయ్య దంపతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ, వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, మాజీ సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ గద్దల వెంకటేష్, మండల యూత్ ప్రెసిడెంట్ అల్లి ప్రశాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం.. అందని ధైన్యం

- కలగానే పీహెచ్‌సీ నిర్మాణం
- నూతన మండలంలో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- అత్యవసర సమయంలో జిల్లా ఆస్పత్రే దిక్కు..
- మూడు ఉప కేంద్రాల్లోనే వైద్యసేవలు



భీమారంలోని ఆరోగ్య ఉపకేంద్రం

భీమారం: మండల కేంద్రంలో పీహెచ్‌సీ లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జైపూర్ మండలం నుంచి భీమారం కొత్త మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పీహెచ్‌సీ నిర్మాణం కలగానే మారింది. ప్రజలు అనారోగ్యానికి గురైతే జైపూర్ లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై భీమారం మండల కేంద్రం ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరిగినా క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం తప్పా స్థానికంగా ఎలాంటి చికిత్స చేసే పరిస్థితి లేదు.

ఇబ్బంది పడుతున్న ప్రజలు..

మండలంలోని ధర్మారం, దాంపూర్, కాజిపల్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే దాదాపు 14 కిలోమీటర్లు ప్రయాణించాలి. అక్కడి నుంచి జైపూర్, చెన్నూర్, మంచిర్యాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వ వైద్యసేవలు అందాలంటే దూరభారం తప్పడం లేదు. అక్కడికి వెళ్లలేని కొందరు ఆర్‌ఎంపీ వైద్యుల వద్దే చికిత్స చేయించుకుంటున్నారు. ఇదే అదునుగా పలువురు ఆర్‌ఎంపీలు.. ఎంబీబీఎస్ వైద్యులు చేసే చికిత్స చేస్తున్నారు. రక్త, మూత్ర పరీక్షలకు వారే పంపిస్తున్నారు. అనంతరం ప్యాకేజీల ద్వారా మందులు అందిస్తున్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీల దోపిడీకి పీహెచ్‌సీ అందుబాటులో లేకపోవడమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందవుతోంది



భీమారంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లే దు. ఏదైనా ప్రమాదాలు జరిగితే మంచిర్యాల, చెన్నూర్, జైపూర్ వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బందవుతోంది. అధికారులు స్పందించి పీహెచ్‌సీ ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలి.

- లక్ష్మణ్, ఆరెపల్లి

108 కోసం ఎదురు చూపులు..

ఏ గ్రామంలో ప్రమాదాలు జరిగినా.. ఇతర అత్యవసర వైద్యసేవల కోసం 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేసి ఎదురుచూడటం పరిపాటిగా మారింది. జైపూర్, చెన్నూరు నుంచి 108 వచ్చే వరకు నిరీక్షణ తప్పడం లేదు. అత్యవసరంలో ఆటోల్లో క్షతగాత్రులను తీసుకొని 108 వాహనానికి ఎదురువెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రంలో అంబులెన్స్ ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు ఆరోగ్య ఉప కేంద్రాలు..

మండలంలోని 11 గ్రామ పంచాయితీలకు కేవలం మూడు ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వాటిల్లోనూ అరకొర వసతులతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. రెండు ఉపకేంద్రాలకు ప్రభుత్వ భవనాలు ఉండగా, దాంపూర్‌లోని సబ్ సెంటర్ చాలా కాలంగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. సుమారు 13 ఏళ్ల క్రితం నూతన భవనం మంజూరై నిర్మాణ పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తికాలేదు.

ప్రతిపాదనలు పంపించాం



మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ దృష్టికి మరోసారి సమస్యను తీసికెళ్లి పరిష్కరిస్తాం.

- బుక్యా తిరుమల, జెడ్పీటీసీ

వనితా వాక్కు ఆధ్వర్యంలో మదర్స్ డే



వేడుకల్లో వనితావాక్కు సభ్యులు

మంచిర్యాలక్రైం: వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్వాడి భవన్‌లో మాతృ దినోత్సవాన్ని వనితా వాక్కు ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వనితా వాక్కు ఫౌండర్ రంగు వేణు కుమార్, సభ్యులు జ్యోత్స్నచంద్రదత్, డాక్టర్ అన్నపూర్ణ, గోనే భాగ్యలక్ష్మి, తాల్లపల్లి కవిత, కుర్మ సునీత, సకిరే కవిత, చిగురు మంజుల, చిదానంద కుమారి, కోమరి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో మదర్స్ డే వేడుకలను న్యాయవాది జుల్ఫికర్ అలీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు పుల్లూరి సత్తెయ్య, పడమటింటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మా ఆశీర్వదించూ...



నెన్నెల: మాతృ దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదివారం తన స్వగ్రామమైన నెన్నెల మండలంలోని జెండావెంకటాపూర్‌లో తల్లి దుర్గం మల్లమ్మను కలిసి పాదాభివందనం చేశారు. మరోసారి ఎమ్మెల్యే కావాలని అమ్మా దీవించు అంటూ ఆశీర్వాదం పొందాడు. సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని తల్లి, తండ్రి, గురువు, దైవంలో మొదటిస్థానం అమ్మదేనని అన్నారు. మలి వయసులో ఉన్నా తల్లి దండ్రులకు పిల్లలు ఆసరాగా నిలవాలని సూచించారు. అమ్మను కలిసి మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలుపడానికే, ప్రత్యేకంగా అమ్మతో కొంతసమయం గడపడానికే స్వగ్రామం వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

విధుల్లో చేరిన జేపీఎస్‌లు

కోటపల్లి: నిరవధిక సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు శనివారం 9మంది విధుల్లో చేరగా ఆదివారం మధ్యాహ్నం వరకు 17మంది కార్యదర్శులు విధుల్లో చేరినట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు.

భీమారం: మండలంలోని 11గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు సమ్మె విరమించి ఆదివారం విధులో చేరారు.

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆదివారం నుంచి సమ్మె విరమించి విధుల్లోకి చేరినట్లు ఎంపీపీ భీరయ్య పేర్కొన్నారు.

కాసిపేట: మండలంలో 17మంది జేపీఎస్‌లు, ఇద్దరు ఓపీఎస్‌లు ఆదివారం సమ్మె విరమించి విధుల్లో చేరారు.

మందమర్రిలో టీడీపీ మినీ మహానాడు

మందమర్రిరూరల్: నియోజకవర్గంలో టీడీపీ ప్రజలకు దగ్గరగా ఉంటూ చేస్తున్న సేవలకు ఆదరణ పెరుగుతుందని, చెన్నూర్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఖాయమని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు, చెన్నూర్ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మినీమహానాడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే బాల్కసుమన్ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. నాయకులు సత్యనారాయణ, ఉమామహేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, అమానుల్లాఖాన్, భాస్కరాచారి, సమ్మయ్య, సంపత్, ఫరీ ఫా, లక్ష్మీరాజం ఉన్నారు.

భైరవస్వామికి ప్రత్యేక పూజలు



భైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలోని భైరవ ఆలయంలో భైరవస్వామికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. కాళీకమాతకు హారతులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి యజ్ఞహోమాలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, చెన్నూర్ పట్టణానికి చెందిన మర్వాడీలు కుటుంబసభ్యులతో తరలివచ్చి స్వామివారికి నైవేధ్యాలతో పుష్పాలంకరణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాలు అందజేశారు.

వీవోఏల వినూత్న నిరసన



కుటుంబ సభ్యులతో కలిసి నిరసన

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బెల్లంపల్లి మండలంలో కొనసాగుతోంది. 28వ రోజు ఆదివారం సమ్మెలో భాగంగా వీవోఏలు వినూత్న నిరసన తెలిపారు. వీవోఏల కుటుంబ సభ్యులు సమ్మెలో పాల్గొని వీవోఏలకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెలో వీవోఏలు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

పొంచి ఉన్న ప్రమాదం



లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అంబేద్కర్‌చౌరస్తా వద్ద ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం కావడంతో.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత మున్సిపాలిటీ అధికారులు చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి:
ఆకుల వెంకటేష్, మున్సిపల్ కమిషనర్
- ఫోన్‌నంబర్: 9963319822



ఒత్కులపల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రామకృష్ణాపూర్: పూజల్లో పాల్గొన్న భక్తులు



భీమారం: హారతి తీసుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



అలంకరణలో ఆంజనేయస్వామి

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమారంతో పాటు పలు ప్రాంతాల భక్తులు హాజరయ్యారు.

చెన్నూర్‌రూరల్: పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఒత్కులపల్లి, ఆస్నాద, కొమ్మెర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, మల్లెపూల దండలతో హనుమాన్ విగ్రహాలకు అలంకరించారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాల్లో భక్తుల కు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఒత్కులపల్లిలో మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు పూజలు నిర్వహించారు.

రామకృష్ణాపూర్: హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం, శేషపల్లితో పాటు క్యాతనపల్లి క్రాస్‌రోడ్ వద్ద గల హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పాలచెట్టు సమీపంలో గల శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచకుండాత్మక హనుమత్ కవచ హోమం, ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణకాంతాచార్యులు, నరసింహాచార్యులు ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో హనుమాన్ మాలాదారులు, భక్తులు పాల్గొన్నారు.



మందమర్రిలో అన్నదానం

ఆంజనేయ స్వామికి పట్టువస్త్రాలు



జన్నారం: కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రిసర్చ్ డిపార్టుమెంట్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్‌నాయక్ మాట్లాడుతూ.. కర్ణాటకలో మతోన్మాదాన్ని ప్రజలు తిరస్కరించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, నాయకులు ఇమ్రాన్‌ఖాన్, నర్సింగరావు తదితరులున్నారు.

హనుమాన్ భక్త మండలి కార్యవర్గం

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్ హనుమాన్ భక్తమండలి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోస్కుల సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా రాపల్లి సతీష్, నల్లుగుండ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మహంకాళి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఆకుల శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా పార్వతి సంతోష్, కోశాధికారిగా బల్ల సత్తయ్య, సలహాదారుగా సూరం దామోదర్ రెడ్డిని ఎన్నుకున్నారు. వీరితో పాటు ఈవెంట్ ఆర్గనైజర్స్‌గా 12మందిని ఎంపిక చేశారు.

నేత్రదానం

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన రాజమౌళి(72)అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కూతురు స్రవంతి, అల్లుడు ప్రసాద్ సదాశయ ఫౌండేశన్ ఆధ్వర్యంలో మృతుడి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు దానం చేశారు.

ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి లైన్‌క్లియర్

- స్థల వివాదానికి తొలిగిన అడ్డంకులు



పోలీసుల బందోబస్తు మధ్య స్థలం కేటాయిస్తున్న రెవెన్యూ అధికారులు

చెన్నూర్: ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి, తొమ్మిదేళ్లుగా సాగుతున్న స్థల వివాదానికి లైన్ క్లియర్ అయ్యింది. ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి చెన్నూర్ పట్టణ సమీపంలో గల గెర్రెకాలనీలోని సర్వే నెంబర్ 869లో 3.01ఎకరాల స్థలాన్ని కేటాయించి ఆర్టీసీ అధికారులకు అప్పగించారు. డీఎంఎఫ్‌టీ నుంచి రూ.4కోట్ల నిధులు మంజూరు కాగా, గత నెల 15న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆర్టీసీ డిపో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థలాన్ని త్వరలోనే ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

స్థలం ఓకే అయ్యింది..

రెవెన్యూ అధికారులు ఆర్టీసీ బస్ డిపో కోసం స్థలాన్ని అప్పగించారు. టెండర్ల ప్రక్రియను ఇంజనీరింగ్ అధికారులు చేపడుతారు. స్థలం పూర్తిగా మా ఆధీనంలోకి వచ్చింది. త్వరలోనే ప్రహరీ నిర్మాణం చేపడుతాం. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి.

- రవీంద్రనాథ్, డిపో మేనేజర్ మంచిర్యాల